'పసుపులేటి' జీవితం ఆదర్శం



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, సభ్యులు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్ వీరయ్య

గచ్చిబౌలి: సామాజిక అసమానతలు, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన పసుపులేటి వెంకటేశ్వరరావు జీవితం నేటి తరానికి ఆదర్శమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ వీరయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ట్రేడ్ యూనియన్ నాయకుడు వెంకటేశ్వరరావు 90వ జయంతి సందర్భంగా 'మహిళా చైతన్యంపై మాట్లాడుదాం రండి' అనే పేరిట రాసిన పుస్తకాన్ని ఏఐకేఎస్ సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లో సీఐటీయూ యూనియన్ ఏర్పాటులో ఆయన కృషి మరువలేనిదన్నారు. మహిళల హక్కుల కోసం పురుషులను చైతన్యం చేయడం మన ముందున్న ప్రధాన కర్తవ్యమన్నారు. మల్లారెడ్డి, మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంతోనే మహిళల భాగస్వామ్యం వచ్చిందన్నారు. అనంతరం వెంకటేశ్వరావు కుటుంబసభ్యులు నేత్ర, అవయవ, శరీరదాన అంగీకార పత్రాలను సంబంధికులు అందించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు జానిలా, సుశీల, అశోక్ కుమార్, అమ్మ నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డిజి నర్సింహ్మారావు, జ్యోతి, యూటీఎఫ్, ఏఐడీడబ్ల్యూ, సీపీఎం, ఎన్‌పిఆర్‌డిలకు చెందిన నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



లబ్ధిదారుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ మాధవరం నగర్ కాలనీకి చెందిన చంద్రమౌళి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. శనివారం ఇందుకు సంబంధించిన చెక్కును శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బాధిత కుటుంబ సభ్యుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటోందని.. అనారోగ్యానికి గురై ఆర్థిక స్తోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలు, అభాగ్యులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాచర్ల భద్రయ్య, రమేష్‌పటేల్, తిరుపతి రెడ్డి, కాశీనాద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న భరతనాట్యం

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో తిల్లాన ఆర్ట్స్ గురువు మాధవి మారేళ్లపూడి శిష్య బృందం శనివారం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకున్నది. మల్లారి, జయ జయ స్వామిన్, వసంత రూపకం, నటేశకౌతం, రార వెను, ఇంద్రరేఖ, తిల్లాన అంశాలను కళాకారులు గంగ, వృందా, సాయిసన్నిధి, అవిజ్ఞ, చేతన, శామృద్ధి, స్మృతి, ఇషితా, అన్వి తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో నృత్యార్చన ..

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో అన్నమాస్వరార్చన కార్యక్రమంలో భాగంగా అక్షద డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ గురువు నిహాంత్రిరెడ్డి శిష్యబృందం శనివారం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది.



కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఈ సందర్భంగా కళాకారులు జ్ఞాశ్రీత, సిత్ర, గృహిత, ధృవిక, ఆద్వి, సుశ్రీ, హని, సౌమ్య, హర్షవి, త్రిష, రచన, లత, నియతి, నిహారిక, నక్షత్ర, ముక్త, యమున, భమి, నిహ్రాంతి, మౌక్తిక, ధన్యతలు వినాయకకౌతం, స్వాగతం కృష్ణ, పార్వతీ వల్లభాష్టకం, నాగేంద్ర హరాయ, దేవదేవం, స్వాగతం కృష్ణ, పార్వతీ వల్లభాష్టకం తదితర అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారణలో కాశీవిశ్వేశ్వరస్వామి



రుద్రహోమం పూర్ణాహుతిలో పాల్గొన్న ప్రతినిధులు, భక్తులు, అర్చకులు

రాయదుర్గం/శేరిలింగంపల్లి: మహాశివరాత్రి మరుసటి రోజు శనివారం కూడా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గంలో మల్లన్న జాతర, నల్లగండ్లలో సోమేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, జల, పాలాభిషేకాలు, పూజలు చస్తశారు. అనంతరం స్వామివార్లకు ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

మల్లన్న స్వామి దర్శనానికి బారులు..

రాయదుర్గంలోని మల్లన్న స్వామిని భక్తులు దర్శించుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, యువజన కాంగ్రెస్ నాయకుడు రినీశ్‌రెడ్డి, ఆలయ నిర్వాహకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నల్లగండ్ల సోమేశ్వరాలయంలో ..

నల్లగండ్లలోని సోమేశ్వర ఆలయంలో రెండు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, స్థానికులు జల, పాలాభిషేకం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, ఆలయ కమిటీ చైర్మన్ పురం విజేందర్‌రెడ్డి, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి అన్నాభిషేకం..

గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలోని కాశీ విశ్వేశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేకంగా అన్నాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం జలాభిషేకం, ప్రత్యేక అలంకారం చేసి భక్తులు దర్శించుకునే అవకాశం కల్పించారు. అలాగే పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నల్లగండ్ల సోమేశ్వరస్వామి ఉత్సవాల్లో నిర్వహిస్తున్న అన్నదానం



పాలాభిషేకం చేస్తున్న శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్



రేగులకుంట చెరువు కట్ట వద్ద జరుగుతున్న పనులు

'రేగులకుంట'కు పునర్ వైభవం!

- రూ.1.50 కోట్లు కేటాయింపు
- కాలనీ వాసుల హర్షం

ముమ్మరంగా చెరువు సుందరీకరణ పనులు

మియాపూర్: దీప్తీశ్రీనగర్ కాలనీ రేగులకుంట చెరువు ఇక పునర్ వైభవం సంతరించుకోనున్నది. సుమారు రూ.1.50 కోట్లతో చేపట్టిన చెరువు సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీ శ్రీనగర్ కాలనీ, రేగులకుంట చెరువు 17 ఎకరాల్లో విస్తరించి ఉంది. గతంలో మంచినీటితో కళకళలాడుతూ.. చుట్టూ పంట పొలాలతో ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉండేది. అయితే కొన్నేళ్లుగా అపార్ట్‌మెంట్, కాలనీలు విస్తరించి భవనాలు నిర్మించడంతో వాటి నుంచి వచ్చే డ్రైనేజీ నీరు చెరువులో కలిసి పూర్తిగా దుర్వాసనతో కాలుష్య కాసారంగా మారింది. దీంతో పాటు చెరువు పై భాగంలో ఉన్న డంప్ యార్డ్ నుంచి వర్షాకాలంలో వరద కూడా నేరుగా చెరువులోకి వస్తుండడంతో చెరువంతా విషపూరితంగా మారి చేపలు కూడా పెద్ద ఎత్తున మృత్యువాత పడ్డాయి. అలాగే దుర్వాసన భరించలేక దీప్తీశ్రీనగర్ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

సాక్షిలో కథనాలు..

చెరువులో గుర్రపు డెక్క, మురుగునీటితో దుర్వాసన, దోమల బెడదతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని సాక్షి దినపత్రికలో పలుమార్లు కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ మంజులారఘునాథ్‌రెడ్డి, అధికారులు చెరువును పరిశీలించి సుందరీకరించాలని నిర్ణయించారు.

రూ.1.50 కోట్లతో పనులు..

గతేడాది సేల్స్ ఫోర్స్ ఐటీ కంపెనీ చెరువు సుందరీకరణ పనులు చేపట్టేందుకు ముందుకు వచ్చింది. రూ.1.50 కోట్లతో పనులను ప్రారంభించింది. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొదటగా చెరువులోని మురుగునీరు, గుర్రపుడెక్క, పూడికను పూర్తిగా తొలగించారు. డ్రైనేజీ నీరు చెరువులో కలువకుండా చర్యలు తీసుకున్నారు. మట్టిపోసి చెరువు కట్టను బలోపేతం చేస్తుండడంతో పాటు వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపడుతున్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చొరవతోనే పనులు జరుగుతున్నాయని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గతంలో రేగులకుంట చెరువు పరిస్థితి

24న సింగర్ సుక్వీందర్ సింగ్ లైవ్‌షో



లైవ్‌షో వివరాలు వెల్లడిస్తున్న సింగర్ సుక్వీందర్ సింగ్

మాదాపూర్: నగరంలోని అజీజ్‌నగర్‌లో గల రాన్‌బోడే కాబలోస్ వద్ద ఈ నెల 24వ తేదీన లైవ్‌షోను ఏర్పాటు చేయనున్నట్లు సింగర్ సుక్వీందర్ సింగ్ తెలిపారు. మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో శనివారం అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శ్రేయస్ గ్రూప్ బిజ్‌బాష్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో లైవ్‌షోలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం లైవ్ షో బ్రోచర్‌ను విడదల చేశారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్ యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ సురభీకాలనీలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.రవికుమార్ యాదవ్ నాయకుడు కె.ఎల్లేష్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రయాణికులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడుతాయన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన కృపాల్‌ను అభినందించారు. కార్యక్రమంలో శేఖర్, శ్రీను, రమేష్, వెంకటేశ్, రమణ కుమార్, జితేంద్ర, వెంకటరావు, పూర్ణ చందర్, శివకుమార్, రవి, జి.జితేంద్ర, నరసయ్య, సుధా, వీణ, విజయవాణి పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.50 వేల ఎల్‌టీసీని శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు శనివారం ఆయన అందజేశారు.

ప్రాథమిక స్థాయి నుంచే సైన్స్‌పై దృష్టి పెట్టాలి

శేరిలింగంపల్లి: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే సైన్స్‌పై దృష్టి పెట్టేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి బాపూనగర్‌లోని ఇమ్మాయిస్ ది స్కూల్‌లో శనివారం నిర్వహించిన సైన్స్‌ఫేర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, హనుమాన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు గోపాల్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



నమూనాల గురించి కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్‌కు వివరిస్తున్న విద్యార్థులు

వైద్య శిబిరానికి స్పందన

శేరిలింగంపల్లి: సురభీకాలనీలో చైల్డ్ ఫండ్ అండ్ సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సురభీకాలనీ యూత్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. హోలిస్టిక్ ఆసుపత్రి కొండాపూర్ సౌజన్యంతో బీపీ, షుగర్, ఈసీజీ, కంటితో పాటు ఇతర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజిషియన్ డాక్టర్ తారక్‌రామ్ మాట్లాడుతూ ఏ చిన్నా అనారోగ్య సమస్య ఉన్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. వ్యాయామం, యోగా, నడక వంటివి చేస్తే రోగాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో చైల్డ్ అండ్ సీడబ్ల్యూసీ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీశైలం, కోఆర్డినేటర్ దివ్య, ఇతర ప్రతినిధులు మమత, షబానా, నిర్మల, డాక్టర్లు, పీఆర్‌ఓ నాగరాజు, పోత వేణి, నర్సింగ్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

80 రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

పటాన్‌చెరు టౌన్: మండల పరిధి పాశమైలారం పారిశ్రామికవాడలో రూ.104 కోట్లతో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ కామన్ ఎఫ్లెంట్ ట్రీట్ మెంట్‌ప్లాంట్ (జెడ్‌ఎల్డీ - సీఈటీపీ) ప్లాంట్‌ను నిర్మించారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం పాశమైలారం పారిశ్రామికవాడలో జెడ్‌ఎల్డీ- సీఈటీపీ ప్లాంట్‌ను మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్లాంట్ వాతావరణ కాలుష్యం లేకుండా చేస్తుందని, దీన్ని ప్రారంభించుకోవడం మంచి పరిణామం అన్నారు. కాలుష్యం లేకుండా చూడాల్సిన బాధ్యత పారిశ్రామికవేత్తలపై ఉందన్నారు. గత ప్రభుత్వం సరిగా పని చేయలేదని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తుంది ప్రజా ప్రభుత్వం అని పేర్కొన్నారు. పరిశ్రమలకు సంబంధించి పదేళ్లలో దొరకని అనుమతులు 80 రోజుల్లో ఇచ్చేలా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. అనంతరం మంత్రి దామోదర మాట్లాడుతూ.. పరిశ్రమలకు సంబంధించిన భూముల్లో కమర్షియల్, రెసిడెన్షియల్ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని అన్నారు. రూ.104 కోట్లతో ఈ ప్లాంట్ ఏర్పాటులో రాంకీ సంస్థ ప్రధాన పాత్ర పోషించడం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. కామన్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వల్ల కాలుష్య నియంత్రణ జరుగుతుందని తెలిపారు. పారిశ్రామిక వాడలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నైపుణ్యం గల కార్మికులను తయారు చేయాలన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. సాంకేతికతను ఉపయోగించి కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం మరిన్ని ప్లాంట్లు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉందని తెలిపారు. వరంగల్‌లో కూడా పరిశ్రమల ఏర్పాటుకు ముందే ఇలాంటి ప్లాంట్ ప్రారంభించేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ, ఆర్డీఓ వసంత కుమారి, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, రవీందర్, ప్రవీణ్ రెడ్డి, కాటా శ్రీనివాస్ గౌడ్, దుర్గా ప్రసాద్ చందు పాల్గొన్నారు.



ఎఫ్లెంట్ ట్రీట్ మెంట్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్, మంత్రులు

ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ

వట్‌పల్లి(అందోల్): పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం మండలంలో రూ.15.10 కోట్ల నిధులకు సంబంధించి పనులకు శంకుస్థాన చేశారు. అందులో భాగంగా వట్‌పల్లిలో 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మహిళల పేరుమీద ప్రారంభించడం ద్వారా మూడు నెలల్లోనే 5 గ్యారంటీలను అమల్లోకి తీసుకువస్తున్నట్లు గుర్తుచేశారు. అనంతరం వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా దర్గా ఉత్సవాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టిఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ,ఆర్డీవో వసంత కుమారి,పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, బీడీఎల్ సీఐ రవీందర్, పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి, తహసీల్దార్లు,పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, పారిశ్రామికవేత్తలు దుర్గాప్రసాద్ చందు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం



సీసీరోడ్డు వేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రతి కాలనీ, బస్తీలను అన్ని రంగాల్లో అభివృద్ధే చేయడమే తన లక్ష్యమని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లితండాలో స్థానికులతో కలిసి సీసీరోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పనులు చేపట్టి త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. దశలవారీగా పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హన్మంతునాయక్, శ్రీనివాస్, శేఖర్, నర్సింగ్‌నాయక్, ప్రభాకర్, ప్రకాశ్, వేణు, కృష్ణ, మహేశ్ నాయక్, వర్క్ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, స్థానికులు పాల్గొన్నారు.

మహిళా శక్తి ఎంతో గొప్పది

బండ్లగూడ: సమాజ నిర్మాణంలో మహిళా శక్తి ఎంతో గొప్పదని చేవెళ్ల మాజీ పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలో అన్నపురెడ్డి స్వర్ణలతాభీమార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళా శక్తి లేకపోతే సమాజం లేదన్నారు. సమాజాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత మహిళలు తీసుకోని ముందుకు సాగుతున్నారన్నారు. అలాంటి వారిని గౌరవించడంతో పాటు అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయానికి డస్ట్‌బిన్‌ల వితరణ

మణికొండ: సంకట హరహనుమాన్ ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచే క్రమంలో వాసవీ క్లబ్ ఫ్యామిలీ వారు డస్ట్‌బిన్‌లను అందజేశారు. శుక్రవారం రాత్రి రూ.20 వేల విలువైన డస్ట్ బిన్‌లను అందించినట్లు వాసవీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నారాయణ స్వామి, జోన్ చైర్మన్ జగన్మోహన్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కృష్ణస్వామి, జైపాల్‌రెడ్డి, గోపాల్‌రావు, అశోక్, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని దుర్గామాత సన్నిధిలో బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, గ్రామపెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిన్నటి తరం నారీమణులకు నీరాజనం



మాట్లాడుతున్న సుశీలా నారాయణరెడ్డి

మణికొండ: ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి సామాజిక అవరోధాలను అధిగమించి చరిత్రలో ప్రముఖంగా నిలిచిపోయిన నిన్నటితరం మహిళా ప్రతిభా మూర్తులను స్మరించుకోవటంతో పాటు వారికి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నీరాజనం పలికారు. మణికొండ మున్సిపాలిటీ, డాలర్స్ హిల్స్‌లోని డాక్టర్ సి.నారాయణరెడ్డి(సినారె) నివాసం విశ్వంభరలో శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో పలువురు ప్రముఖ మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుశీలా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా కర్ణాటక సంగీత విద్వాంసురాలు, నర్తకి బెంగళూరు నాగరత్నమ్మ, హిందుస్థానీ సంగీత విద్వాంసురాలు నైనా దేవిల గురించి ప్రసంగించారు. నాగరత్నమ్మ దేవదాసి వర్గంలో జన్మించినా పట్టుదలతో సంగీత నృత్యాల్లో ప్రావీణ్యం, సంస్కృతం, తెలుగు, కన్నడ, తమిళం వంటి భాషల్లో పాండిత్యం సాధించి గొప్ప విదుషీమణిగా పేరుపొందటంతో పాటు అనేక ధర్మకార్యాలు చేసిందన్నారు. భూమిక సంపాదకురాలు, రచయిత్రి కొండవీటి సత్యవతి, కొండపల్లి కోటేశ్వరమ్మ ఉద్యమ చరిత్ర, రచయిత్రిగా ఆమె పడిన కష్టాలను వివరించారు. ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి తన భర్త శివరాజుకు దీటుగా కథలు, చిత్రలేఖనాలు చేశారన్నారు. సామాజికంగా ఎటువంటి ప్రోత్సాహం లేని ఆ కాలంలో ఇలాంటి మహిళలు ఉన్నత శిఖరాలకు ఎదిగి నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. ప్రముఖ నర్తకి, నాట్య గురువా డాక్టర్ యశోదా ఠాకూర్ దేవదాసీ నాట్యశైలిని, ఆలయ ఆస్థాన నృత్యకళ గురించి, అన్నాబత్తుల బులి వెంకటరత్నం అనే నృత్యకారిణి జావళిని అభినయపూర్వకంగా యశోద ప్రదర్శించి అభినందనలు అందుకున్నారు. ట్రస్ట్ అధ్యక్షురాలు సి.గంగ, మహిళలు, రచయిత్రిలు, కళాకారులు పాల్గొన్నారు.

కాలువలో మృతదేహం లభ్యం

హఫీజ్‌పేట్: కాలువలో మృతదేహం లభ్యమైన ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బార్గాకు చెందిన రామలింగప్ప (55) తన చిన్నతనంలోనే నగరానికి వలస వచ్చాడు. చందానగర్ పాపిరెడ్డి కాలనీ రాజీవ్ గృహకల్పలో నివాసముంటూ ఇక్కడే కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నెల 8న సాయంత్రం 6 గంటలకు మద్యం తాగి ఇంటికి వచ్చాడు. రాత్రి 9 గంటలకు మళ్లీ మద్యం తాగేందుకు వెళ్తున్నాని అటు నుంచే ఊరికి పోతానని ఇక ఇంటికి రానని కూతురికి చెప్పి బయలుదేరాడు. మరుసటి రోజు కూతురు తండ్రి కోసం గాలించగా ఆచూకీ లభించలేదు. శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో చందానగర్‌లోని పాపిరెడ్డి కాలనీ కెనాల్‌లో రామలింగప్ప మృతదేహం లభ్యమైందని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్‌సీ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. జనాభాలో సగానికి పైగా ఉన్న మహిళలు కూడా ఆయా రంగాల్లో ఉన్నతంగా ఉండాలని సూచించారు. మహిళలు తమ కష్టాలకు ఎటువంటి భయాందోళనకు గురికాకుండా పోరాడి సాధించుకోవాలని సూచించారు. ఈ రోజుల్లో మహిళలకు ఆర్థికంగా, రాజకీయంగా, వ్యాపారం రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులు, కార్మికులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మహిళా ఉద్యోగుల కోసం టాయిలెట్ల వద్ద ఏర్పాటు చేసిన శానిటరీ నాప్‌కిన్ వెండింగ్ మిషన్‌ను ప్రారంభించారు. మహిళా ఉద్యోగుల వ్యక్తిగత శుభ్రతకు ఈ మిషన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యాలయంలో కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అధికారులు ఉమాదేవి, హేమభాను, శ్రీకాంత్ రెడ్డి, డా. సాల్మన్‌రాజ్, రూపాదేవి, ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.